క్లుప్తంగా

జాతీయస్థాయిలో సత్తా చాటిన కేఎల్‌పీ విద్యార్థులు



గుంటూరు ఎడ్యుకేషన్: జాతీయస్థాయి అథ్లెటిక్స్‌లో సత్తా చాటి పతకాలు కైవసం చేసుకున్నారని డాక్టర్ కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ జి.రత్తయ్య తెలిపారు. జేకేసీ కళాశాల రోడ్డులోని కేఎల్‌పీ స్కూల్లో శుక్రవారం విద్యార్థుల అభినందన నిర్వహించారు. రత్తయ్య మాట్లాడుతూ మిర్యాలగూడలో జరిగిన సీబీఎస్ఈ క్లస్టర్ గేమ్స్‌లో తమ పాఠశాల నుంచి పాల్గొన్న 11వ తరగతి విద్యార్థులు మెహరాజ్ రజతం, సాయి శరణ్య కాంస్య పతకం సాధించారని తెలిపారు. అదే విధంగా టాటా గ్రూప్ నిర్వహించిన టాటా బిల్డింగ్ ఇండియా స్కూల్ ఈజీ కాంపిటీషన్‌లో భాగంగా వ్యాసరచన పోటీలో జూనియర్ విభాగంలో ఉమస్యత్ తహసిన్, కె.నాగశ్రావ్య, నక్కా స్వరూపిణి, సీనియర్ విభాగంలో వేములూరి అక్షయ, ఎల్. ప్రణతి, ఓ. వెంకట సాయి బహుమతులు గెలుపొందారని వివరించారు. వీరిని పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, పాఠశాల వ్యవస్థాపకుడు డాక్టర్ కె.బసవపున్నయ్య అభినందించారు.

కవి గాంధర్వుడు బోయి భీమన్న

నెహ్రూనగర్: తెలుగు సాహిత్యాన్ని ఆంధ్రప్రదేశ్‌కు పరిచయం చేసిన తొలి తరం కవి రచయిత బోయి భీమన్న అని భీమ్‌భారత్ రాష్ట్ర అధ్యక్షులు పాగళ్ల ప్రకాష్ పేర్కొన్నారు. భీమన్న జయంతిని పురస్కరించుకుని అరండల్‌పేటలోని సంఘ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన సాహిత్యం ద్వారా ప్రజలను చైతన్య పరిచేందుకు ఎంతగానో దోహదపడ్డాయన్నారు. 1975లో గుడిసెలు కాలిపోతున్నాయి అనే రచనకు సాహిత్య అకాడమి పురస్కారంతో సహా అనేక అవార్డులను దక్కించుకున్నారన్నారు. కార్యక్రమంలో సాధు మాల్యాద్రి, తాడికొండ నరసింహారావు, కొండపల్లి విల్సన్, అంకం శ్యామ్, నల్లపు నీలాంబరం పాల్గొన్నారు.

రేపు నగరంలో సైక్లోథాన్

నెహ్రూ నగర్: నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సైక్లోథాన్(సైకిల్ ర్యాలీ) ఆదివారం నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వచ్ఛతా హి సేవలో భాగంగా నగర ప్రజలకు స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తూ, వారిని స్వచ్ఛ గుంటూరు సాధనలో భాగస్వాములను చేయడానికి చేపట్టినట్లు చెప్పారు. ఉదయం 6:30 గంటలకు పోలీస్ పరేడ్ గ్రౌండ్ వద్ద ప్రారంభమై రమేష్ హాస్పిటల్, శంకర్ విలాస్ సెంటర్, మదర్ థెరిస్సా విగ్రహం సెంటర్, కొరిటెపాడు సెంటర్, గుజ్జనగుండ్ల జంక్షన్, కంకరగుంట ఫ్లై ఓవర్ మీదుగా తిరిగి పోలీస్ పరేడ్ గ్రౌండ్‌కి చేరుతుందని చెప్పారు. ర్యాలీలో విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులు, ట్యాక్స్ పేయర్స్, వ్యాపారస్తులు, ప్రజా ప్రతినిధులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. నగర ప్రజలు కూడా సైకిల్ ర్యాలీలో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

తెలంగాణకు భాష్యం రూ.కోటి 25 లక్షల విరాళం



గుంటూరు ఎడ్యుకేషన్: తెలంగాణలో ఇటీవల సంభవించిన వరదల కారణంగా సర్వస్వం కోల్పోయిన బాధితులను ఆదుకునేందుకు భాష్యం విద్యాసంస్థల తరఫున రూ.కోటి 25 లక్షలను తెలంగాణ సీఎం సహాయనిధికి అందజేసినట్లు విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లోని సచివాలయంలో కలసి ఆ మొత్తాన్ని చెక్కు రూపంలో అందజేశామని పేర్కొన్నారు. ఆపన్నులను ఆదుకోవడంలో ఎల్లప్పుడూ ముందంజలో ఉండే భాష్యం తమ వంతు సహాయమందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో భాష్యం హైదరాబాద్ సీఈవో చైతన్య, జెట్టి కుసుమకుమార్ పాల్గొన్నారు.

హాస్పిటల్ ఎదుట మృతుడి బంధుల ఆందోళన

గుంటూరు మెడికల్: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందడంతో వైద్యులే ప్రాణం తీశారంటూ ఆరోపిస్తూ ఆస్పత్రి ఎదుట మృతుని బంధులు ఆందోళన చేసిన ఘటన నగరంలో చోటు చేసుకుంది. వివరాలు.. తాడేపల్లి మండలం గుండిమెడ గ్రామానికి చెందిన గుండిమెడ శ్రీనివాసరావు(50) అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స కోసం ఐదు రోజుల క్రితం గుంటూరులోని గుంటూరువారితోటలోని ఓ హాస్పిటల్‌లో అడ్మిట్ చేశారు. చికిత్స పొందుతూ శ్రీనివాసరావు శుక్రవారం రాత్రి మృతిచెందాడు. తుంటి నొప్పితో ఆస్పత్రిలో చేరితే ప్రాణం పోయాల్సిన వైద్యులు ప్రాణం తీశారని మృతుడి బంధువులు ఆరోపిస్తూ ఆసుపత్రి ఎదుట ఆందోళన చేశారు. కాగా ఈ ఘటనపై ఆసుపత్రి అధినేత వివరణ కోరగా చికిత్స అందిస్తున్న సమయంలో హార్ట్ స్ట్రోక్ రావడంతో అత్యవసరంగా ఐసీయూకు తరలించి చికిత్స అందించామన్నారు. తీవ్రమైన అనారోగ్య సమస్యలతో తమ వద్దకు శ్రీనివాసరావును తీసుకొచ్చారని, రోగి బంధువులకు ఆరోగ్య పరిస్థితి వివరించిన అనంతరమే చికిత్స అందించామన్నారు.

100% హామీలు తూచ్!

- ఆర్ఓబీల నిర్మాణం కలేనా..
- ఆటోనగర్‌లో అర్హులకు దుకాణాల కేటాయింపు ఉందా!
- ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు శూన్యం
- మానస సరోవర్ వైపు చూస్తే ఒట్టు
- జీజీహెచ్‌లో ప్రత్యేక సెల్ ఊసేలేదు
- ఇదీ తూర్పు ఎమ్మెల్యే నసీర్ హామీల వైఫల్యం

వందరోజులు పాలన ప్రజలను నిరాశ పరిచింది. పాలకులు నగర అభివృద్ధిపై ఇచ్చిన హామీల ఊసేలేదు. పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. రోడ్లు ఏమాత్రం మెరుగుపడలేదు. చిన్నపాటి వర్షం నగరాన్ని ముంచెత్తుతోంది. కూటమి రాగానే అంతన్నారు.. ఇంతన్నారు.. కనీసం వాటిపై స్థానిక ఎమ్మెల్యే నసీర్ సమీక్ష చేసిన దాఖలాలు లేవు.



ఎన్నికల ముందు జిన్నాటవర్‌లో వద్ద బహిరంగ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్, పక్కన సీఎం చంద్రబాబు(ఫైల్)



ఎన్నికల్లో సమయంలో నసీర్ ఇచ్చిన ఎన్నికల హామీపత్రం

పట్నంబజారు: అధికారం కోసం కల్లబొల్లి కబుర్లు చెప్పారు.. ఎన్నికల ముందు ఇచ్చిన హామిలన్నీ నీటిపై రాతలుగానే మిగిలిపోయాయి.. శిశుపాలుడి పాలనను తలపించేలా.. కూటమి ప్రభుత్వ వంద రోజుల పాలన నడిచింది.. ప్రజలంతా ఇదేం దయ్యా చంద్రం అనుకునే పరిస్థితులు దాపురించాయి. ఎన్నికల సమయంలో జిన్నాటవర్ సెంటర్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అనేక హామీల వర్షాలు కురిపించారు.

ప్రత్యేకంగా మైనారిటీలకు..


అందులో ముఖ్యంగా మైనారిటీ కార్పొరేషన్ ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి రూ.5 లక్షల వరకు రుణాలు, మసీదులు బాగు చేసుకునేందుకు ఆర్థిక చేయూత.. ఇమామ్, మౌజాన్‌లను రూ.5 వేలు, రూ.10వేలు అందజేత వంటి ప్రకటించిన ఏ ఒక్కటి అమలకు నోచుకోలేదు. అదే విధంగా తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గెలుపొందిన కూటమి అభ్యర్థి ఎండీ నసీర్‌అహ్మద్ సైతం ఎన్నికల సమయంలో అనేక హామీలను విస్తృతంగా ప్రచారం చేసినప్పటికీ... 100 రోజుల పాలనలో ఏ ఒక్కరికి అమలకు నోచుకోలేదు.

రోడ్లు యథాతథంగా..

నియోజకవర్గంలోని పొన్నూరు రోడ్డు, నందివెలుగు రోడ్డు, మంగళగిరి రోడ్డు, ఏటుకూరు రోడ్డును అభివృద్ధి చేస్తామని చెప్పినా.. అడుగు కూడా ముందుకు కదలలేదు. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు నిష్ణాతులైన అంతర్జాతీయ కన్సల్టెంట్స్ వారి ద్వారా అందిస్తామని చెప్పిన మాటలు కార్యరూపందాల్చలేదు.

ఒక్క పట్టా అయినా ఇచ్చారా..?

- దశాబ్దాలుగా నివాసాలు ఏర్పరుచుకుని జీవనం సాగిస్తున్న పేదలకు పక్కా రిజిస్ట్రేషన్ చేయిస్తామని ఎన్నికల సాక్షిగా హామీ ఇచ్చారు.
- ఆర్‌యూబీలను నిర్మించడం ద్వారా నందివెలుగు రోడ్డు, డొంక రోడ్డు, మూడు వంతెనలు, సంజీవయ్యనగర్ అభివృద్ధి చేస్తామని చెప్పిన మాటలు.. మాటలకే పరిమితమయ్యాయి.
- ఆటోనగర్‌లో పదేళ్ల నుంచి అద్దె షాపుల్లో వ్యాపాలు చేస్తున్న ప్రతి ఒక్కరికి సొంత షాపులు కట్టించి ఇస్తామని, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేస్తామని, రోడ్లు నిర్మిస్తామని వ్యాపారులకు మాటనిచ్చారు.
- పేద మధ్యతరగతి ప్రజలకు అతితక్కువ ఖర్చులతో పెళ్లిళ్లు, శుభకార్యాలు చేసుకునే విధంగా కల్యాణమండపం నిర్మిస్తామని చెప్పారే తప్ప.. ఒక్క ఇటుక కూడా వేయలేదు.
- మానస సరోవరం పార్క్‌ను అభివృద్ధి చేసి అంతర్జాతీయ స్థాయి పార్క్‌గా తీర్చిదిద్దుతామని బీరాలు పలికారు.. కనీసం నియోజకవర్గ స్థాయిలో కూడా అభివృద్ధి చేసింది లేదు.. కనీసం చూసింది లేదు.
- భక్తుల కొంగు బంగారమైన వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రతిష్ఠను పెంపొందించటం.
- ఆంధ్రా ముస్లిం కళాశాల అభివృద్ధి గురించి పూర్తిగా మరిచిపోయారు.
- దళితులు, క్రైస్తవులు, ముస్లిం, హిందూ శ్మశాన వాటిలకు సంబంధించి పూర్తిస్థాయిలో మౌలిక



నందివెలుగు రోడ్డులో నిలిచిన ఫ్లై ఓవర్ నిర్మాణం

వసతులు కల్పిస్తామని.. కనీసం కన్నెత్తి కూడా ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ అటువైపు చూడలేదు.

- రెండు రూపాయలకే 20 లీటర్ల సురక్షిత తాగునీటిని నియోజకవర్గంలోని ప్రతి గడపకు అందజేస్తామని చెప్పి.. చుక్క నీరు అందించిన పాపాన పోలేదు.. ఏ ఒక్క చోట ప్లాంట్‌లను ఏర్పాటు చేయలేదు.
- ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. ఇంత వరకు హామీ అమలు కాలేదు.
- అంజుమన్ సంస్థ ద్వారా వచ్చిన ప్రతి పేద ముస్లింల అభివృద్ధికి కేటాయిస్తామని ఆ సంగతినే విస్మరించారు.
- గుంటూరును గంజాయి విముక్తి నగరంగా మారుస్తామని చెప్పారు.. కూటమి ప్రభుత్వంలో గంజాయి అమ్మకాలు మరింత జోరందుకున్నాయి.
- మున్సిపల్ కార్పొరేషన్ ద్వారా వీధి కుక్కలను కట్టడి చేస్తామని చెప్పిన విషయాన్ని విస్మరించారు.
- కాపు, వైశ్య, బీసీ, ఎస్, మైనారిటీ వర్గాలకు సంబంధించిన సత్రాల బాధ్యతను వారికే అప్పగిస్తామని హామీ ఊసేలేదు. కానీ పూర్తి నిర్వహణ ఎమ్మెల్యే కనుసన్నల్లోనే నడుస్తోందని వినికిడి.
- ఇమామ్, మౌజాన్, పాస్టర్, అర్చకులకు సొంత ఇల్లు లేని వారికి నివాసాలు కట్టుకునే విధంగా స్థలాలు కేటాయించేందుకు కృషి చేస్తామని హామీనిచ్చి 100 రోజుల్లో ఒక్కరికి కూడా స్థలం ఇప్పించలేని పరిస్థితుల్లో ఎమ్మెల్యే ఉన్నారు.

విధుల్లో చేరిన జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్



గుంటూరు మెడికల్: అమెరికా పర్యటనకు వెళ్లిన గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ 23 రోజుల సెలవుల అనంతరం శుక్రవారం విధుల్లో చేరారు. విజయవాడలోని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ నరసింహంను కలిసి జాయినింగ్ రిపోర్టు అందజేసి మధ్యాహ్నం ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ అమెరికాలో స్థిరపడిన గుంటూరు వైద్య కళాశాల పూర్వ వైద్య విద్యార్థులు రీ యూనియన్‌కు తనను ఆహ్వానించటంతో అక్కడకు వెళ్లినట్లు చెప్పారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ కూడా అమెరికా వచ్చారని, జింకానా సభ్యులతో జీజీహెచ్ అభివృద్ధి గురించి చర్చించామన్నారు. దక్షిణ భారత దేశంలో ఎక్కడా లేని విధంగా 600 పడకలతో మాతా శిశు సంరక్షణ భవనం జింకానా సభ్యుల సహకారంతో నిర్మాణం జరుగుతుందన్నారు. త్వరలోనే భవన నిర్మాణ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని తెలిపారు. భవన నిర్మాణ కోసం జింకానా సభ్యులు భారీగా విరాళాలు ఇస్తున్నట్లు వెల్లడించారు. డాక్టర్ పాదిల ప్రసాద్ సూపర్ స్పెషాలిటీ భవనంపైన మరో రెండు అంతస్తుల నిర్మాణం చేసేందుకు డాక్టర్ పాదిల ప్రసాద్ ముందుకొచ్చారని చెప్పారు. ఆస్పత్రిలో పరిశుభ్రత మరింత మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని వారు సూచించారన్నారు. అమెరికా పర్యటన ముగించుకుని విధుల్లో చేరిన డాక్టర్ కిరణ్‌కుమార్‌ను పలువురు వైద్యులు అభినందించారు.

సీనియర్ అసిస్టెంట్‌లకు ఆఫీస్ సూపరింటెండెంట్లుగా ఉద్యోగోన్నతి

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకుల కార్యాలయం(ఆర్డీ) పరిధిలో సీనియర్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న నలుగురికి శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించి ఆఫీస్ సూపరింటెండెంట్లుగా ప్రమోషన్ ఇచ్చారు. గుంటూరు ఆర్డీ డాక్టర్ కొల్లాటి సుచిత్ర అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలించి ప్రాధాన్యం ప్రకారం అభ్యర్థులు కోరుకున్న ప్రదేశాల్లో ప్రమోషన్ ఉత్తర్వులు అందజేశారు. పల్నాడు జిల్లా మాచవరంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎం.రమాతిరుపతిరావుకు గుంటూరు జీజీహెచ్ ఆఫీస్ సూపరింటెండెంట్‌గా ప్రమోషన్ ఇచ్చారు. నెల్లూరు గవర్నమెంట్ కాలేజీలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎస్.విజయకుమారికి నెల్లూరు డీఎంహెచ్ఓ కార్యాలయం ఆఫీస్ సూపరింటెండెంట్‌గా ప్రమోషన్ ఇచ్చారు. ప్రకాశం జిల్లా పీసీ పల్లిలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎం.డి.రషీద్‌కు నెల్లూరు డీఎంహెచ్ఓ కార్యాలయం ఆఫీస్ సూపరింటెండెంట్‌గా, నెల్లూరు జిల్లా దగదర్తిలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కె.వెంకటేశ్వరరావుకు ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాలలో ఆఫీస్ సూపరింటెండెంట్‌గా ప్రమోషన్ ఇచ్చారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఆఫీస్ సూపరింటెండెంట్ షేక్ నాగూర్ షరీఫ్, సీనియర్ అసిస్టెంట్ బి.శ్యామ్ అనిల్ పాల్గొన్నారు.

ఘనంగా తులసీ యోగిష్ చంద్ర జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న తులసి యోగిష్ చంద్ర

కొరిటెపాడు: తులసి సీడ్స్ మేనేజింగ్ డైరెక్టర్ తులసి యోగిష్ చంద్ర పుట్టినరోజు వేడుకలు శుక్రవారం అరండల్‌పేటలోని యోగి భవన్‌లో ఘనంగా నిర్వహించారు. తులసి సంస్థ సిబ్బంది, మిత్రులు, అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేశారు. అభిమానులు, పలువురు ప్రముఖులు, శ్రేయోభిలాషులు, అభిమానులు వారిని పుష్పమాలతో సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు, భవిష్యత్‌లో తులసి గ్రూప్ సంస్థలు మరింత అభివృద్ధి చెందాలని వారు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా తులసి యోగిష్ మాట్లాడుతూ అభిమానులు, శ్రేయోభిలాషుల సమక్షంలో జన్మదిన వేడుకలు జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. సంస్థకు వెన్నుదన్నుగా నిలిచిన ప్రతి ఒక్క ఉద్యోగికి ధన్యవాదాలు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ దేశానికి చేస్తున్న సేవలు, దేశ సంక్షేమం కోసం తీసుకుంటున్న నిర్ణయాలను కొనియాడారు. తాను తన సోదరుడు తులసి కృష్ణ చైతన్య, తులసి గ్రూప్ సంస్థలను ఎంతో బాధ్యతతో తమ తండ్రి తులసి రామచంద్ర ప్రభు ఆశయాలకు అనుగుణంగా అత్యుత్తమ నాణ్యతతో కూడిన ఉత్పత్తులను వినియోగదారులకు అందజేస్తున్నామన్నారు. అందిస్తున్న సేవా కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ప్రముఖులు టీవీ రావు, చందు సాంబశివరావు, ఏటుకూరు మాజీ సర్పంచి ఉగ్గిరాల సీతారామయ్య, మలిశెట్టి సుబ్బారావు, తోట రామకృష్ణ, తోట సుబ్బారావు, తోట శ్రీనివాస్, పసుపులేటి రమణయ్య, విష్ణుమొలకల ప్రసాద్, బైరిశెట్టి మల్లికార్జున రావు, సుప్రీం సర్జికల్స్ జవహర్, పోలిసేని సాంబశివరావు, మాగంటి సుధాకర్ యాదవ్, దళావాయి సుబ్రహ్మణ్యం, మామిడాల రాజేష్, షేక్ ఖాసిం, చిట్టిప్రోలు శ్రీధర్, ఉగ్గిరాల రాజా, ఉగ్గిరాల కోటేశ్వరరావు, బొక్కిసం శివరాం, తులసి గ్రూప్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం అభినందనీయం

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి సేకరించిన బియ్యాన్ని అప్పగిస్తున్న ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు

గుంటూరు వెస్ట్: వరద బాధితులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి సేకరించిన 12 టన్నుల బియ్యాన్ని శుక్రవారం స్థానిక కలెక్టరేట్ ఆవరణలో ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ బియ్యాన్ని వరద ప్రభావిత ప్రాంత పాఠశాల విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకానికి అందజేస్తామన్నారు. ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ వరద బాధితుల కోసం 14 టన్నుల బియ్యంతోపాటు రూ.40 లక్షల నగదును సేకరించారన్నారు. దీన 2 టన్నుల బియ్యాన్ని వరద ప్రభావిత ప్రాంతాల్లో అందజేశారని చెప్పారు. నగదును రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధికి అందజేసామని చెప్పారు. కార్యక్రమంలో డీఈఓ శైలజ, డీఎస్ఓ కోమలి పద్మ పాల్గొన్నారు.

బదిలీల ప్రక్రియ కలెక్టర్ సమక్షంలో నిర్వహించాలి

లక్ష్మీపురం: ఉమ్మడి గుంటూరు జిల్లాలో పనిచేస్తున్న గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ల బదిలీ ప్రక్రియ జిల్లా కలెక్టర్ సమక్షంలో నిర్వహించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బందెల నాసర్ జీ డిమాండ్ చేశారు. స్థానిక కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గుంటూరు జిల్లా సోషల్ వెల్ఫేర్ డీడీ మధుసూదన్ రావుపై అవినీతి ఆరోపణలు వస్తున్నాయని చెప్పారు. బాధ్యతల నుంచి తప్పించాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు పాశం వెంకటేష్, ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి యశ్వంత్, దుర్గా సాయి, అజయ్, డేవిడ్, అమర్నాథ్, బన్నీ, గౌతమ్, శివా పాల్గొన్నారు.

ప్రజారోగ్య కార్మికులకు వైద్య పరీక్షలు



పారిశుద్ధ్య కార్మికులకు గుడ్డ సంచులను అందజేస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: ప్రజారోగ్య పరిరక్షణకు నిరంతరం కృషి చేసే ప్రజారోగ్య కార్మికుల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరమని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. స్వచ్ఛత హి సేవలో భాగంగా స్థానిక రెవెన్యూ కళ్యాణ మండపంలో ఐటీసీ బంగారు భవిష్యత్ ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ ప్రజారోగ్య కార్మికులకు వైద్య పరీక్షలు, ఆర్థిక పొదుపుపై అవగాహన శిబిరంలో శుక్రవారం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ నగర ప్రజల ఆరోగ్య రక్షణకు తెల్లవారుజాము నుంచే విధుల్లో ఉండే ప్రజారోగ్య కార్మికులకు వైద్య పరీక్షలు వారికి ఆర్థిక అంశాలపై ఐటీసీ బంగారు భవిష్యత్ ప్రతినిధులు అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. విజయవాడ వరద సహాయక చర్యల్లో పాల్గొన్న కార్మికులకు త్వరలో రెండు జతల దుస్తులు అందిస్తామన్నారు. కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు నగరపాలక సంస్థ తరఫున నియోజకవర్గాల వారీగా మెగా హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. స్వచ్ఛత హి సేవలో 4వ రోజు నగరంలో విరివిగా మొక్కలు నాటే కార్యక్రమాలు జరిగాయన్నారు. నగర ప్రజలు స్వచ్ఛత హి సేవ కార్యక్రమాల్లో పాల్గొనేలా కార్మికులు అవగాహన కల్పించాలని కోరారు. డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ నిత్యం వ్యర్థాల మధ్య జీవనం గడిపే కార్మికులు తమ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. నగరంలోని పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో సుమారు 62 రకాల వైద్య పరీక్షలు, చికిత్సలు అందుబాటులో ఉన్నందున వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నగర కమిషనర్ సూచనల మేరకు ప్రజారోగ్య కార్మికులకు త్వరలో క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్ ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఐటీసీ బంగారు భవిష్యత్ సీనియర్ ప్రోగ్రాం మేనేజర్ గౌరీ నాయుడు మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ సాధనలో ముందు ఉండే కార్మికులకు అండగా ఉంటామన్నారు. కార్మికుల పిల్లల్లో 18 నుంచి 30 ఏళ్లలోపు, 8వ తరగతి పాస్ అయి, నిరుద్యోగులుగా ఉంటే వారికి తగిన వృత్తి శిక్షణ అందించి, ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాలు అందించేందుకు తోడ్పాటు ఇస్తామన్నారు. అనంతరం పర్యావరణ హితంగా ఉండే గుడ్డ సంచులను కమిషనర్, ఇతర అతిథులు ఆవిష్కరించి, కార్మికులకు అందించారు. కార్యక్రమంలో పోస్టల్ డిపార్ట్‌మెంట్ పీఆర్ఓ మాధవ్, శానిటరీ సూపర్వైజర్ సోమశేఖర్, ఐటీసీ బంగారు భవిష్యత్ నుంచి సురేష్, నిరంజన్, నారాయణ పాల్గొన్నారు.

తిరుమల ప్రసాదం పవిత్రత కాపాడాలి



గుంటూరు మెడికల్: తిరుమల ప్రసాదం తయారీలో జరుగుతున్న తప్పుడు విధానాల మార్చాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం గుంటూరు చంద్రమౌళి నగర్‌లోని బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆల్ఫా అనే సంస్థకు ఎందుకు కాంట్రాక్టు ఇచ్చారు, ఎంతకు ఇచ్చారనే విషయాలను బయట పెట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర కుమార్, రాష్ట్ర పబ్లిసిటీ, లిటరేచర్ కన్వీనర్ పాలపాటి రవికుమార్ పాల్గొన్నారు.

తప్పు చేసిన వారిని శిక్షించాలి

గుంటూరు మెడికల్: తిరుపతి లడ్డు తయారీలో అవకతవకలు జరిగాయని, దీనికి కారణం అన్యమతస్తుల ప్రవేశమేనని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు యలవర్తిపాటి పాండురంగ విఠల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లడ్డూల తయారీపై దుష్ప్రచారం ఆపి, తప్పుచేసిన వారిని పట్టుకుని శిక్షించాలే కాని ప్రచారం ఎందుకని ప్రశ్నించారు.

క్రైం వార్తలు

వృద్ధుడి అదృశ్యం



లక్ష్మీపురం: వృద్ధుడి అదృశ్యంపై అరండల్‌పేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. వివరాలు.. కొరిటెపాడు అరుంధతి నగర్ ప్రాంతానికి చెందిన కె.ప్రకాష్ రావు 80 సంవత్సరాలు. చాలా కాలంగా వయసు రీత్యా మానసిక స్థితి సరిగా లేక చికిత్స పొందుతున్నాడు. అయితే జూలై 25వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన ప్రకాష్‌రావు తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుమార్తె సుధారాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకి తెలిసిన వారు అరండల్‌పేట పోలీసులకు సమాచారం తెలియజేయాల్సిందిగా తెలిపారు.

నిమజ్జనానికి అని వెళ్లి యువతి..

మంగళగిరి వినాయక నిమజ్జనానికి స్నేహితుని ఇంటికి వెళ్లి వస్తానని వెళ్లిన బాలిక తిరిగి ఇంటికి రాక పోవడంతో తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. వివరాలు.. శారదాకాలనీ 25వ లైన్ ప్రాంతానికి చెందిన మేడా రమేష్, భార్య యశోద జీవనం సాగిస్తుంటారు. వీరికి ఒక్కగానొక్క కుమార్తె భవానీ ఉంది. 8వ తరగతి వరకు చదివి ప్రస్తుతం ఇంటి వద్దనే ఉంటుంది. అయితే ఈనెల 18వ తేదిన మంగళగిరిలో స్నేహితుల ఇంటి వద్ద వినాయక నిమజ్జనం ఉందని వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. చుట్టు పక్కల, మంగళగిరి స్నేహితుల ఇంటి వద్ద వెతుకలాడగా ఎంతకు కనిపించక పోవడంతో శుక్రవారం తల్లి యశోద ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లా కళాశాల విద్యార్థిని..

లక్ష్మీపురం: స్థానిక జేకేసీ కళాశాలలో లా తృతీయ ఏడాది విద్యార్థిని కనిపించక పోవడంతో కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టాభిపురం పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. నరసరావుపేటకు చెందిన చెరువుగట్టు వెంకటేశ్వరరావు బంగారం తయారు చేసే పని చేస్తుంటాడు. ముగ్గురు కుమార్తెలున్నారు. మూడో కుమార్తె లా కళాశాలలో తృతీయ సంవత్సరం హాస్టల్‌లో ఉండి చదువుతోంది. అయితే శుక్రవారం కనిపించక పోవడంతో వెంకటేశ్వరరావు పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లైంగిక దాడి కేసులో ఇద్దరికి ఇరవై ఏళ్లు జైలు

నగరంపాలెం: ఇంటర్ విద్యార్థినిపై లైంగిక దాడి కేసులో ఇద్దరికి ఇరవై ఏళ్లు జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ గుంటూరు ఐదో అదనపు జిల్లా జడ్జి కె.నీలిమ శుక్రవారం తీర్పు చెప్పారు. వివరాలు... గుంటూరు ఏటుకూరు రోడ్డు చాకలిగుంటకు చెందిన యువతి, ఆమె ఇంటి ఎదురుగా ఉండే గోపీనాయక్ ప్రేమించుకున్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం చదివే సమయంలో ఇంట్లో తెలియడంతో చదువు మాన్పించారు. పక్క వీధిలో ఉండే అమ్మమ్మ లక్ష్మమ్మ ఇంట్లో ఉంచారు. అక్కడ ప్రేమికుడి మాటల నమ్మి అతడితో శారీరకంగా కలిశారు. పెళ్లి చేసుకునే ఉద్దేశంతో 2018 జూన్ 21న ఇంటి నుంచి బయటకు వచ్చేసింది. గోపీనాయక్ కలిసేందుకు ప్రయత్నించింది. కానీ ఫోన్‌లో స్పందించలేదు. రఫీకి చెందిన ఆటోలో తిరుగుతుండగా గోపీనాయక్, విద్యార్థిని బంధువులు అక్కడకు రావడంతో మళ్లీ ఆటోలోనే వెళ్లిపోయింది. ఇదే అవకాశంగా తీసుకున్న ఆటోడ్రైవర్ లైంగిక దాడికి పాల్పడ్డాడు. జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా తెలియజేసింది. దీనిపై తూర్పు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. నేరం రుజువు చేయడంతో ఏటుకూర్‌రోడ్డు సుగాలీకాలనీకి చెందిన గోపీనాయక్, నెహ్రూనగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ రఫీకి ఇరవై ఏళ్లు జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. అప్పటి తూర్పు ఎస్‌డీపీఓ కె.శ్రీనివాసులు కేసు దర్యాప్తు చేయగా, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.శ్యామల ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

అక్కినేని వ్యక్తిత్వం స్ఫూర్తిదాయకం

దర్శక రచయిత ప్రభుకు సినీ పాత్రికేయ సామ్రాట్ బిరుదు ప్రదానం



ప్రభు, రత్తయ్యచౌదరిలకు బిరుదు, పురస్కారం అందజేత

నగరంపాలెం: అక్కినేని నాగేశ్వరరావు చలన చిత్ర జీవితం, వ్యక్తిత్వం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని సీనియర్ ఫిలిం జర్నలిస్ట్, దర్శక రచయిత ప్రభు కొనియాడారు. ఈవీవీ యువ కళావాహిని ఆధ్వర్యంలో దివంగత ప్రముఖ సినీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి ముగింపు ఉత్సవాలు శుక్రవారం అమరావతి రోడ్‌లోని సురేష్ మూవీస్ కార్యాలయంలో నిర్వహించారు. ఉత్సవాలకు ఈవీవీ యువ కళావాహిని అధ్యక్షుడు వెచ్చా కృష్ణమూర్తి అధ్యక్షత వహించారు. ప్రభు మాట్లాడుతూ అక్కినేనితో సుదీర్ఘ అనుబంధం తన అదృష్టమని అన్నారు. దర్శకత్వం చేసే అవకాశం రావడం, ఆయనపై గ్రంథం రచించడం తన జీవితంలో మధుర అనుభూతులని పేర్కొన్నారు. సురేష్ మూవీస్ జిల్లా మేనేజర్ మాదల రత్తయ్యచౌదరి మాట్లాడుతూ సాటిలేని సినీ దిగ్గజం అక్కినేని అని కొనియాడారు. అనంతరం ప్రభుకు సినీ పాత్రికేయ సామ్రాట్ బిరుదును, మాదల రత్తయ్యచౌదరికి అక్కినేని పురస్కారాన్ని అందించారు. కార్యక్రమంలో అక్కినేని అభిమానులు లండన్ ప్రసాద్, మణి, పి.కిరణ్, రమణ, గుప్తా పాల్గొన్నారు.

డీటీఓ రాజగోపాలరావుపై ఉద్యోగ సంఘ నాయకుల ఫిర్యాదు

గుంటూరు వెస్ట్: సహచర ఉద్యోగుల కనీస హక్కుల కోసం కృషి చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సయ్యద్ చాంద్ బాషాను జిల్లా ఖజానాధికారి బి.రాజగోపాలరావు వేధింపులకు గురిచేస్తున్నారని రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి ఆరోపించారు. ఈ మేరకు ఉద్యోగ సంఘ నాయకులు శుక్రవారం రాత్రి కలెక్టరేట్ ఆవరణలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం డీఆర్వో పెద్ది రోజాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల హక్కులను కాపాడాల్సిన డీటీఓ సిబ్బందికి అన్యాయంగా మెమోలు ఇచ్చారన్నారు. దీనిని ప్రశ్నించినందుకు చాంద్ బాషాపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో చాంద్ బాషా, శివారెడ్డి, కరీముల్లా షాఖాదిరి, హేమలత, పద్మజ పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
(గుంటూరు ఈస్ట్)
90109 57733
Office mail : sakshigntadvt@gmail.com